
# వరద



—విశ్వామిత్ర

**రామనాథానికి పొద్దుటే ఆరుగంటలకి తెలివొచ్చింది. వీధి గది తలుపు తెరవగానే జోరుగా జల్లు వచ్చి మొఖం మీద కొట్టింది. వెంటనే తలుపు మూసేశాడు.**

అన్నట్టు అర్థరాత్రే వర్షం మొదలైంది కదా. ఇంకా తగ్గలేదని చికాకు పడ్డాడు. మళ్ళీ ముసుగు దన్ని నిద్రపోడానికి ప్రయత్నించాడు కానీ నిద్ర పట్టలేదు. తుపాను హెచ్చరిక రెండు రోజుల క్రిందటే ఇచ్చారు. ఇవాళల్లా వర్షం పడేలా గుంది. ఆఫీసుకి వెళ్ళడమెలా అని ఆలోచించాడు.

వర్షం ఇంకా ఎక్కువ ఉధృతమైతే ఆఫీసు మానేయ వచ్చు, లేకపోతే ఎలాగోలాగు వెళ్ళక తప్పదు. ఆధునిక జీవితంలో ఆఫీసు బానిసత్వం గురించి, పల్లెటూళ్ళ స్వేచ్ఛా జీవితం గురించి ఆలోచిస్తూ కొంత సేపు గడిపాడు. ఇంతలో గడియారం ఏడు గటలు కొట్టింది. ఇక లాభం లేదని లేచి మళ్ళీ తలుపు తెరచి చూశాడు. వర్షం ఇందాకటికన్నా ఇంకా తీవ్రంగా వున్నట్టనిపించింది. రేడియో పెట్టుకొందామంటే కరెంటు పోయింది. శ్రీమతి, పిల్లలు ఇంకా లేవలేదు.

రామనాథానికి కాఫీ మీద మనసు పోయింది. తొందరగా ముఖం కడుక్కొని వంటింట్లోకి వెళ్ళి చూశాడు. పాలు లేవు. పాలవాడింకా రాలేదని విసుక్కొన్నాడు. గుమ్మంలో చూస్తే వార్తా పత్రిక కూడా రాలేదు. రామనాథానికి తోచడం లేదు. కాలుగాలిన పిల్లిలా అటూ ఇటూ తిరగడం మొదలెట్టాడు. ఇక వుండబట్టలేక భార్యను లేపేశాడు."ఈ తుపానులో ఏమిటి కొంపలు మునిగాయని లేపేశారు"అని ఆవిడ చికాకు పడ్డది. "కొంపలు నిజంగా మునిగేటట్లే వున్నాయి ఈ వర్షానికి అన్నాడు."కాస్త కాఫీ కలిపి ఇయ్యి ప్రాణాలు తోడుకు పోతున్నాయి"అన్నాడు." ఏం మనిషో ఏమో లేచే సరికల్లా కాఫీ గొంతులో పడక పోతే విలవిల్లాడి పోతారు"అంటూ వంటింట్లోకి వెళ్ళి చూసింది. ఫ్రిజ్‌లో కూడా చూసి ఒక్క చుక్క పాలు లేవు."ఈ వర్షంలో పాలెలా వస్తాయి, ఊరుకోండి" అంది. రామనాథానికి కోపం పెరిగి పోతోంది. కానీ ఏం చేయలేక వూరుకొన్నాడు. తుపాను సంగతి తెలిసి ముందు రోజే పాలు కొని ఫ్రిజ్‌లో పెట్టొచ్చుగా.

ఇక పేపరు వాడి సంగతి సరే. కాస్త వర్షం పడితే పేపరివ్వడం మానేస్తాడు. ఇక ఎలక్ట్రిసిటీ వాళ్ళ సంగతి సరేసరి. మామూల్నప్పుడే ఎప్పటికప్పుడు కరెంటు తీసేస్తుంటారు. ఇక యీ తుపానులో ఇవాళంతా కరెంటు తీసేస్తే అడిగే నాథుడుండడు. ఈ దేశంలో డిసిప్లిన్ అనేది పోయింది. పని మీద శ్రద్ధ లేదు. దేశం నాశనమై పోతోంది.

వంటింట్లోంచి శ్రీమతి "ఏమండోయ్, కాస్త గొడుగేసుకొని వెళ్ళి పాలడబ్బా పట్రండి. అలాగే ఏవైనా కూరగాయలు దొరుకుతే తీసుకురండి. ఈ రోజు కింత ఉడకేస్తాను. డబ్బా పాలతో కాస్త కాఫీ చేసుకొందాం" అని కేకవేసింది. ఇక తప్పదేక గొడుగు తీసుకొని బయలుదేరాడు. ఈదురుగాలి గొడుగుని ఎగరగొట్టేస్తోంది. వానజల్లు ఒళ్ళంతా తడిపేస్తోంది. ఎక్కడా కొట్లు తెరచిన జాడలేదు. వీథుల్లో మడమలదాకా నీళ్ళు ప్రవహిస్తున్నాయి. కొంత దూరం వెళ్ళి లాభం లేదని తిరిగి వస్తుంటే సందుకొసని శేఖర్ మేడ మీంచి "ఏమిటి మాస్టారూ, ఊరు మునిగిపోతోంటే షికార్లు కొడుతున్నారు. ఏరు పొంగి పోయిందట. కొన్ని గంటల్లో వూళ్ళోకి పొంగి పోయి ముంచేసేట్టు వుందట. పల్లపు ప్రాంతాలన్నీ ఖాళీ చేయించేస్తున్నారు. తెలీదా" అని కేకేశాడు.

"అయినా మన వీథి ఎత్తులోనే వుంది గదా ఫర వాలేదనుకొంటాను" అని మళ్ళీ అన్నాడు. రామనాథం ఈ మాట విని వెంటనే తొందరగా నడుచుకుంటూ ఇంటికొచ్చి గుమ్మం తలుపు తట్టాడు. గడియ వేసి వుంది. వెనక నించి వాన చినుకులు బాణాల్లా తగులు తున్నాయి. తలుపు దబదబా బాదడం మొదలు పెట్టాడు. భార్య వచ్చి తలుపు తీయగానే "ఇంతట్లోనే తలుపులు బిగించేయాలా?" అని కసురుకున్నాడు. "మీకేం చెప్తారు. తలుపు తీయగానే వర్షం నీళ్ళన్నీ మన ఇంట్లోనే. మళ్ళీ ఎత్తుకోలేక నేను చావాలి" అని తక్కువ జవాబిచ్చింది. "పాలడబ్బా, కూరలు తెచ్చినట్టు లేదే, అయినా మీరు వెళ్తే పని ఎప్పుడవుతుంది లెండి వుట్టి చేతుల్తో రావడమేగా" అని ఎత్తి పొడిచింది.

రామనాథానికి పెళ్ళాం మీద పీకల దాకా కోపం వచ్చింది. అయినా "కల్చర్డు పర్సన్" కాబట్టే తమాయించుకొన్నాడు. "పని మనిషి ఇంతదాకా రాలేదు. ఇకేమొస్తుంది. ఇవాళ బండెడు చాకిరీ నాదే"నని భార్య గొణుగుతున్నది. రామనాథానికి పెళ్ళాం మీద, పాలవాడి మీదా, పని మనిషి మీదా, ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటు మీదా, బజార్లో షాపుల వాళ్ళ మీదా, కూరగాయల వాళ్ళ మీదా కోపం వచ్చింది. వర్షం వచ్చినప్పుడల్లా వీథులన్నీ చెరువుల్లా చేసే మునిసిపాలిటీ వాళ్ళ మీద కూడా కోపం వచ్చింది.

డాబా ఎక్కి మెట్ల గదిలోంచి చూశాడు. ఎక్కడ చూసినా జలమయం. తన వీథే కొంత నయం. ఎన్ని ఇళ్ళు మునిగి పోయాయో, ఎంత నష్టం కలిగిందో తెలీకుండా వుంది. ఈ వర్షంలో ఆఫీసుకి వెళ్ళడం ఎలా? ఎలాగేమిటి మానేస్తే సరి. రేపు ఆఫీసరు అడిగితే "ఇంత జల ప్రళయంలో ఎలా వస్తావని అనుకొన్నావయ్యా", అని నిలదీసి అడుగుతాను. గవర్నమెంటు ఉద్యోగస్తులందరికీ రవాణా సౌకర్యం కలగచేయొద్దా? వచ్చే నెల యూనియన్ మీటింగులో ఈ విషయం లేవనెత్తాలి అనుకొన్నాడు. ఈలోగా పిల్లలు లేచి తయారయ్యారు. వాళ్ళకీ వర్షం సరదాగా వుంది. స్కూలుకి వెళ్ళక్కర లేదుగా. ఈ కాలం పిల్లలకి చదువు మీద శ్రద్ధ ఎక్కడేడిసింది. టి.వి. రావడం లేదని పిల్లల గోల. వీళ్ళకి టి.వి. మీదవున్న శ్రద్ధలో సగమేనా చదువు మీద వుంటే బాగుణ్ను. విద్యావిధానం తగలడింది. కాలేజీలు నాశనమయ్యాయి అనుకొంటూ కూర్చున్నాడు.

ఆ మర్నాటిదాకా వర్షం తెరిపీయలేదు. పొద్దున్న తొమ్మిది గంటల ప్రాంతంలో వర్షం వెలిసి, వీథుల్లో నీళ్ళు క్రమేపీ తీయడం మొదలెట్టాయి. ఎలాగో ఆలస్యంగా ఆఫీసుకి చేరుకొన్నాడు. ఒకరిద్దరు తప్ప ఎవరూ రాలేదు. డిసిప్లిన్ పాడయి పోయింది. అనుకొన్నాడు. కొంత సేపయ్యాక కొలీగ్ వచ్చి "రామనాథంగారూ, ఇవాళ్టికి హాజరు పట్టీ వేశాం కదా ఇక వెళ్ళొచ్చు. మనం కూర్చొని చేసేదేముంది? ఆఫీసరు కూడా వెళ్ళి పోయా"డని చెప్పి లాక్కెళ్ళేడు.

ఇంటికెళ్ళాక పని మనిషి నర్సమ్మ వచ్చింది. రానందంతోటే గోల పెట్టింది. " మా పేటంతా మునిగి పోయిందమ్మా. ఇంట్లో సామాన్లూ, బియ్యం అన్నీ వరదలో కొట్టుకు పోయాయమ్మా. స్కూల్లో తలదాచుకొన్నాం నిన్నంతా. పనిచేయక పోతే మాలాంటివాళ్ళకి జరుగుతుందమ్మా! గవర్నమెంటోళ్ళు సాయం చేస్తే మళ్ళీ గుడిసె లేసుకోవాలి. అందాకా ఒక ఇరవై రూపాయిలిప్పించడమ్మా" అని గోల పెట్తోంది. తన భార్యకిదేమీ పట్టనట్టుంది. నిన్నటి నుండి తాను పడ్డ కష్టమంతా ఏకరువు పెట్తోంది.

రామనాథానికి చివుక్కుమనిపించింది. తనూ, తన కుటుంబం ఈ రెండు రోజుల తుపానులో పడ్డ కష్టం, అసలు కష్టమనుకొంటే ఏపాటిది! టి.వి., కాఫీ, పేపరూ లేకపోవడం లాంటివేగా! వీళ్ళు కొంపలు మునిగి పోయి, వస్తువులన్నీ కొట్టుకు పోయి, తలదాచుకోడానికేనా సరియైన వసతి లేక తిండి లేక ఎంత అవస్థ పడ్డారో! వీళ్ళకిది మామూలే అనుకోవచ్చు గానీ వాళ్ళది మాత్రం ప్రాణం కాదా, కష్ట సుఖాలు అందరికీ ఒకటే కదా! కానీ మనిషి తన కష్టమే ఎక్కువనుకొంటాడు. ఎదుటి వాడి కష్టాన్ని గురించి ఆలోచించడు. "కల్చర్డ్ పర్సన్" అయినా తనూ అంతే. ఈ ఒక్క సారైనా తన గూడులోంచి బయట పడదామనుకొన్నాడు. జేబులోంచి యాభై రూపాయిల నోటు తీసి నర్సమ్మ చేతిలో పెడుతూ "నర్సమ్మా ఇది తీసుకెళ్ళు. మళ్ళీ జీతంలో విరుచుకోనులే" అన్నాడు. శ్రీమతి తన వైపు కొర కొరా చూస్తోంది గానీ, చూడనట్టు వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు. పని మనిషి వెళ్ళిపోగానే భార్య వచ్చి "డబ్బు ఖాతర లేని మనిషి" అని సాధిస్తుందని తెలిసినా.